మద్యం షాపులకు 304 దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని 52 షాపులకు గానూ ఇప్పటివరకు 304 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్ తెలిపారు. దరఖాస్తులు స్వీకరించేందుకు మరో రెండు రోజులు గడువు మాత్రమే ఉందన్నారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు ప్రభుత్వం నిర్దేశించిన రూ.2లక్షలు (నాన్ రిఫండబుల్) రుసుం చెల్లించి తమ దరఖాస్తులను త్వరగా సమర్పించాలని చెప్పారు. ఈనెల 9 సాయంత్రంలోగా తమ దరఖాస్తులను పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తుల గడువు ముగిసిన పిదప ఈనెల 11న కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి షాపులను కేటాయించనున్నట్లు వివరించారు.

జిల్లా పేరు నుంచి 'మన్యం' తొలగిస్తారా?

- తీసేయాలని గతంలో కోరిన ప్రజా సంఘాలు
- పార్వతీపురం జిల్లాగా స్థిరీకరణ?



ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా నుంచి మన్యం పేరును తొలగిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో పార్వతీపురం మన్యం జిల్లా అని నామకరణం చేశారు. దీనిపై అప్పుడే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పార్వతీపురం జిల్లా అంటే సరిపోతుందని, మన్యం అనే పేరు ఎందుకని కొంతమంది ప్రశ్నించారు. మన్యం అనే ట్యాగ్ లైన్ చేర్చడాన్ని తప్పుపట్టారు. మన్యం అనే పేరు చేర్చడం వల్ల జిల్లా అంతా షెడ్యూల్ ప్రాంతంలోకి వెళ్తుందేమో, తమ ఆస్తులు అన్యాక్రాంతమవుతాయేమోనని జిల్లాలో గల కొంతమంది స్థానికేతర భూస్వాములు (సెటిలర్లు) ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోనూ, ఇతర జిల్లాల నుంచి వలస వచ్చిన భూస్వాములు అక్కడే స్థిరపడ్డారు. ప్రధానంగా సాలూరు, మక్కువ, పాచిపెంట, కురుపాం, కొమరాడ మండలాల్లో సెటిలర్లు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దశాబ్దాల క్రితమే వారు ఈ ప్రాంతానికి వచ్చి చౌకధరలకు భూములు కొనుగోలు చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్నారు. వీరంతా ఆర్థికంగా, రాజకీయంగా బలమైన సామాజిక వర్గానికి చెందిన వారే. గత ప్రభుత్వం హయాంలోనే మన్యం పేరును తొలగించాలనే అభిప్రాయాన్ని వీరు వ్యక్తం చేశారు. అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో కొంతమంది నాయకులు ఉద్దేశపూర్వకంగా జిల్లాకు మన్యం అనే పేరును తగిలించారనే అనుమానాలు కూడా వారికి వున్నాయి. మూడునెలల క్రితం జరిగిన ఎన్నికల్లో వైసిపి ఓడిపోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో సెటిలర్లకు అనుకూలమైన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లయింది. తాజాగా టిడిపి ప్రభుత్వం గతంలో ఏర్పడిన కొత్త జిల్లాలను పునర్విభజన చేయడం, ఇప్పుడున్న జిల్లాలకు అదనంగా కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలకు తోడు మరో నాలుగు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నూతన ప్రతిపాదనల్లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాను పార్వతీపురం జిల్లాగా నామకరణం చేయాలనే ప్రతిపాదన కూడా పరిశీలనలో వున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదనకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కూడా ఆమోదం తెలిపే అవకాశం ఉంది. మన్యం పేరును తొలగించినంత మాత్రాన నష్టమేమీ లేదని, ఉన్నా ఒనగూరే ప్రయోజనం కూడా లేదనే అభిప్రాయం అన్ని వర్గాల్లోనూ వ్యక్తమవుతోంది.

గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల నిరసన

నిరసన ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగ సమస్య నుంచి కాపాడుకోవడానికి అమెరికా ప్రపంచంలో యుద్ధాలను సృష్టిస్తుందని, ఇందులో భాగంగానే పాలస్తీనా జాతిని నాశనం చేయడానికి ఇజ్రాయిల్‌ను ఉపయోగించి ఆయుధాలను సరఫరా చేస్తూ గాజాలోని స్కూళ్లో, కాలేజీలు, ఆస్పత్రులు, దేవాలయాలు, చర్చిలు, మసీదులపై దాడులు, దౌర్జన్యం చేస్తూ సృష్టిస్తుందని, ఈ మారణ హోమాన్ని ఆపాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో గల నాలుగు రోడ్ల కూడలి వద్ద సోమవారం వామపక్షాల (సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, లిబరేషన్) ఆధ్వర్యంలో సంఘీభావ దినం పాటించారు. అనంతరం జరిగిన సభలో వామపక్ష జిల్లా నాయకులు రెడ్డి వేణు, కూరంగ మన్మధరావు, బొత్స నర్సింగరావు, ఎం.భాస్కరరావు, పి.భాస్కరరావు, పి.సంగం తదితరులు మాట్లాడారు. గతేడాది అక్టోబర్ 7న ప్రారంభించిన ఈ దాడులు విరమిస్తామని చెబుతూనే ఏడాది పాటు కొనసాగిస్తుందన్నారు. ఇజ్రాయిల్ గాజా, పాలస్తీనాకు జాతిపై దాడులు, యుద్ధం ఆపాలని, కాల్పులు విరమణ చేపట్టాలని కోరారు. శాంతిని కాపాడే భారతదేశం అలీన ఉద్యమాన్ని మోడీ ప్రభుత్వం ఉల్లంఘించి పాలస్తీనా జాతిని అంతం చేయాలని చూస్తున్న అమెరికాకు, ఇజ్రాయిల్‌కు మద్దతు పలుకుతుందన్నారు. అలీన విదేశాంగ విధానాన్ని కాలం రాసిందని, ఈ యుద్ధాన్ని, దాడులను అమెరికాలో వ్యతిరేకిస్తున్న విద్యార్థుల్ని, ప్రజలను, సంఘాల్ని అమెరికా ప్రభుత్వం అణిచివేసి తన ఆయుధాల్ని అమ్ముకొని ప్రపంచాన్ని నాశనం చేయాలని చూసే విధానాన్ని ప్రజలంతా ఖండించి పాలస్తీనాకు సంఘీభావంగా నిలవాలని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష వై.మన్మధరావు, పి.రమణి, వి. ఇందిర, దుర్గాదేవి, బి.సూరిబాబు, బుడితి అప్పలనాయుడు, సూరయ్య, కుమార్, పి.శ్రీనునాయుడు, సర్వేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, కూరంగి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

ప్రజాశక్తి -పాలకొండ

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దంపతులు కోటదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకులు దారలపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు జరిపి, ఆలయ విశిష్టతలు వివరించారు. సాముహిక పూజలలో కూడా కలెక్టర్ దంపతులు పూజలు నిర్వహించారు. పోలీసు అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఉత్సవాలు ప్రశాంతంగా జరుగుతున్నాయి.

రైతులకు పరిహారమివ్వాలంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కేసులు పెట్టాలి

నష్టపోయిన గిరిజనులకు పరిహారమివ్వాలి
ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి- పార్వతీపురం

మక్కువ మండలంలో నకిలీ మొక్కజొన్న విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని, నష్టపోయిన గిరిజన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మండలంలోని నంద గ్రామానికి చెందిన 13మంది గిరిజనులు మక్కువ మండల కేంద్రంలో ఉన్న వ్యాపారులు కొంచాడ శ్రీనివాసరావు, గ్రంధి గున్న రాజుల దగ్గర మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయారని, వారికి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ మక్కువ మండల కేంద్రంలో ఉన్న వ్యాపారస్తులు కొంచాడ శ్రీనివాసు, గ్రంధి గున్న రాజులు మక్కువ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులకి మొక్కజొన్న విత్తనాల పంపిణీ చేశారని నందలో 13 మంది రైతులు వీరి వద్ద మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి సుమారు 20 ఎకరాల భూముల్లో విత్తనాలు నాటారని చెప్పారు. విత్తనం బాగా మొలకెత్తినప్పటికీ పెరుగుదల వచ్చేసరికి గిడస భారి పోయిందని అన్నారు. పూర్తిగా వెన్ను రాకుండా పోయిందని, పంట పూర్తిగా నాశనం అయిపోవడం వల్ల గిరిజనలు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని చెప్పారు. ఒక ఎకరానికి సుమారు 30 వేల రూపాయలు వరకు పెట్టుబడులు పెట్టారని పంట పండితే ఎకరానికి ముప్పై క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుందని ఆ లెక్కన క్వింటా 2,500 చొప్పున ఒక ఎకరానికి 75 వేల రూపాయలు ఆదాయం రావాలని చెప్పారు. పూర్తిగా పాడైపోవడం వల్ల పెట్టుబడులే పూర్తిగా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. గిరిజనులకు విత్తనాలు అమ్మిన సదరు వ్యాపారులు రసీదులు ఇవ్వలేదని చెప్పారు. ఇది చట్టరీత్యా నేరమన్నారు. గిరిజనులు చెబుతున్న ప్రకారం ఒక్క ఈ విత్తనాలకే కాకుండా ఎరువులు, పురుగు మందులు, వరి విత్తనాలు ఏవి కొనుగోలు చేసిన మక్కువ వ్యాపారస్తులుకు రసీదులు ఇచ్చే అలవాటు లేదని, కాబట్టి వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గంగు నాయుడు డిమాండ్ చేశారు. మొక్కజొన్న పంట నష్టపోయిన గిరిజనులకు ఎకరానికి 75 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని లేకపోతే రానున్న రోజుల్లో గిరిజనులందరినీ కదిలించి కంపెనీ ఏజెంట్ల ఇళ్ళ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మక్కువ మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ గిరిజనులు పాల్గొన్నారు.



దర్జాగా చెరువుల కబ్జా

- రోజురోజుకూ మాయమవుతున్న ట్యాంకులు
- సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం బేఖాతరు
- హైడ్రా తరహా విధానం వస్తేనే మేలంటున్న పరిరక్షణ సమితి

'ఏ చెరువులోనూ సెంటు భూమిని కూడా ముట్టుకునే అధికారం జిల్లా సర్వోన్నత అధికారాలున్న కలెక్టర్‌కు కూడా లేవు. ప్రజా ప్రతినిధులకు సైతం వాటిని ప్రోత్సహించే హక్కు లేదు. ప్రజా ప్రయోజనాలు అవసరం కోసం చెరువును ముట్టుకున్నా, దానికి చట్టపరమైన విధి విధానాలు లోబడే జరగాలి'

- చెరువుల పరిరక్షణపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలివి

ప్రజాశక్తి - జామి

చెరువులు అంటేనే రైతాంగానికి, నీటి నిల్వలకు కల్పతరువులు. కానీ అవే చెరువులు మరికొద్ది రోజుల్లో పుస్తకాల్లో మాత్రమే చదువుకునే స్థితికి చేరుకునేలా కబ్జాలకు గురవు తున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 3వేలకు పైగా చెరువులు కబ్జాలకు గురైనట్లు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సర్వేలో తేలింది. ఈ లెక్కన కనిపించకుండా పోవడానికి మారెంతకాలం పట్టేటట్టు లేదు. ఈ నేపథ్యంలోనే పొరుగు రాష్ట్రంలో సంచలనం సష్టిస్తున్న హైడ్రా వంటి ఏజెన్సీ రాష్ట్రానికి రావాలని చెరువుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి. ఒకవేళ హైడ్రా తరహా నిర్ణయం మన ప్రభుత్వం తీసుకొస్తే, ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన హైడ్రా చట్టం సంచలనం రేపుతున్న విషయం తెలిసిందే. ప్రధానంగా అక్రమణకు గురైన చెరువులు, వాగులపైన కట్టిన కట్టడాలను కూల్చేసిన తీరు అందరిలోనూ చర్చకు తెరతీసింది. అలాంటి విధానం మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకొస్తే, జిల్లాలో మాయమైన, కబ్జాలకు గురైన చెరువులు బతికి బట్టకడతాయని ప్రకృతి ప్రేమికుల ఆశ.

ఉమ్మడి విజయనగరం జిల్లా పూర్వం రాజుల పాలనలో ఎక్కువ కాలం ఉన్న కారణంగా ఎక్కడా లేనటువంటి అత్యధిక చెరువులు జిల్లాలో రాజులు తవ్వించారని నానుడి. అందులో నిజానిజాలు పక్కన పెడితే, ఉమ్మడి జిల్లాలో సుమారుగా 9,334 చెరువులు ఉన్నట్లు అధికారిక అంచనా. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలో 2300 చెరువులు ఉండగా, మిగిలినవి విజయనగరం జిల్లాలో ఉన్నాయి. కానీ ఇందులో సుమారుగా 3 వేల చెరువులు కబ్జా కొరల్లో చిక్కుకోగా, మరో 2 వేల చెరువులు కొంత అక్రమణకు గురైనట్లు అంచనా వేస్తున్నారు. వీటిలో అత్యధికంగా రాజకీయ నాయకులు, రియల్‌స్టేట్ వ్యాపారులు చేసిన కబ్జాలే ఎక్కువ. సామాన్యుడు చెరువు గట్టుపై చిన్న పాక వేస్తే, ఆగమేఘాలపై పీకి పారేసిన అధికారులు బడా నాయకులు చెరువును మొత్తాన్ని కప్పేసినా పట్టించుకోని పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. విజయనగరం అర్బన్ ఏరియాలో 88 చెరువుల్లో 30 చెరువులకు పైగా కబ్జాకు గురికాగా, ఇందులో రియల్‌స్టేట్ వ్యాపారులు ఆక్రమించినవే అధికం. కానీ పేదలు ప్రభుత్వ భూమిలో చిన్న గుడిసె వేస్తే, నానా యాగి చేసే రెవెన్యూ అధికారులు బడా అక్రమదారుల జోలికి మాత్రం వెల్లడం లేదు. జామి మేజరు పంచాయతీలో ఊరు నడిబొడ్డున 7.36 ఎకరాల చెరువును దర్జాగా కప్పేసినా పట్టించుకోలేదు. ఇరిగేషన్ అధికారులు తమ చెరువు అక్రమణకు గురైంది, తొలగించండి అంటూ రెవెన్యూ అధికారులకు రాస్తున్నా, దాన్ని పట్టించుకోవడం లేకపోవడమే అందుకు నిదర్శనం. ఇలా ఒక్క జామి, విజయనగరమే కాదు. జిల్లాలో చాలా చెరువుల పరిస్థితి ఇదే. జిల్లాలో చెరువులను కాపాడుకోవాలంటే హైడ్రా తరహా విధానం తీసుకొచ్చి, అది సామాన్యులపై కాకుండా బడా కబ్జాదారులపై ప్రయోగించాలి. అప్పుడే చెరువుల సంరక్షణ సాధ్యమవుతుంది.

చెరువుతో మనిషి మనుగడ

చెరువులు జిల్లాలో నీటి నిల్వలకు పునాది. అత్యధిక చెరువులున్న ప్రాంతం మనది. కానీ నేడు వేలాది చెరువులు కబ్జాల పాలవుతున్నాయి. దీనిపై చెరువుల పరిరక్షణకు ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నాము. ప్రధానంగా చెరువులు, వాగులు కాపాడే విధంగా ప్రభుత్వం విధానాలు రూపొందించి దాన్ని పారదర్శకంగా పని చేసేలా చూస్తేనే లాభం.

- ఈశ్వర్ ప్రసాద్,
ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షులు

చెరువులే పొలాలకు జీవం

చెరువులు ఉంటేనే, పంట పొలాలు, భూగర్భ జలాలకు ఆధారం. రాష్ట్రంలో హైడ్రా వంటి విధానం వచ్చినా, రాకపోయినా జిల్లాలో అటువంటి విధానం అవసరం. పూర్వం రాజుల కాలంలో మన జిల్లాలో ఎక్కువ చెరువులు తవ్వించారు. కాబట్టే సాగునీటి రంగంపై ప్రభుత్వాలు ఎంత చిన్న చూపు చూసినా, చెరువుల ద్వారానే జిల్లాలో అత్యధిక పంటలు పండించేవారు. కాబట్టి అటువంటి చెరువులను కాపాడుకోవడం మన బాధ్యత.

- బూసర్ల రమణారావు,
న్యాయవాది, జామి

చెరువులతో భూగర్భ జలాలకు రక్షణ

చెరువులు ఉంటేనే, మనిషి మనుగడకు అవసరమైన భూగర్భ జలాలు మిగులుంటాయి. కాబట్టి చెరువులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి. హైడ్రా వంటి విధానం వస్తే, చెరువు ఆక్రమణ చేపట్టిన బడా అక్రమార్కులపైన, అందుకు సహకరించిన అధికారులపైన చర్యలు తెసుకోవాలి.

- రాయవరపు సత్యం,
ఆయకట్టు రైతు సంఘం నాయకులు,
వెన్నెపాడు

ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఒ జి.కేశవనాయుడుతో కలిసి ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. జిల్లా లోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 105 మంది అర్జీదారులు తమ వినతులను కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయానే నమ్మకంతో నలుమూల ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలని ఉద్బోదించారు. అనంతరం అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నాటు వైద్యం వికటించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

నాటువైద్యం వికటించి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సీడిమానుగూడలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం ఆరిక మోహనరావు (26) ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. దీంతో మరుసటి రోజు తనకు తెలిసిన పసరు మందు వేసుకుని నాటువైద్యం చేయించుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లమని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. చివరికి ఆదివారం ఉదయం ఒక్కసారిగా మోహనరావు స్పృహ కోల్పోగా, వెంటనే కుటుంబ సభ్యులు 108 ద్వారా కురుపాం సీహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోహనరావుకు భార్య శైలజ, 2 నెలల కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతి చెందిన మోహనరావు

పిఎం యశస్వి పథకం కింద ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం యశస్వి పథకం కింద ఉపకార వేతనాలు పొందేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు బిసి సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుచున్న బిసి, ఇబిసి, సంచార జాతులకు చెందిన విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులన్నారు. కావున అర్హత కలిగిన 9,10వ తరగతి విద్యార్థులు ఈనెల 15 లోగా, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, పాఠశాల/కళాశాల ధ్రువీకరణ పత్రాలు ఆన్లైన్లో పొందుపర్చాలన్నారు. దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించరాదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు https://vet.nta.ac.in వెబ్సైటు ను సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

జాతీయ స్థాయిలో పోటీపడేలా శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జాతీయ స్థాయిలో పోటీపడేలా జిల్లాలోని క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో క్రీడా సాధికారిత సంస్థ జిల్లా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విలు విద్యకు మంచి శిక్షణ ఇవ్వడం జరుగుతోందని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపాలని ఆయన సూచించారు. జిల్లాలో క్రీడాకారులకు కొరత లేదని వారికి సరైన శిక్షణ, వసతి కల్పిస్తే జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తెస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు మన్యం జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొని, గెలుపొందుతున్నారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో పెరిగిన పోటీలను దృష్టిలో పెట్టుకుని ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఎంపిక చేయాలని సూచించారు. ప్రాచీన కాలం నుంచి గుర్తింపు పొందిన విలువిద్యలో మన జిల్లాలో క్రీడాకారుల్లేరని, రాష్ట్ర స్థాయిలో జరిగే విలు విద్యలో మన జిల్లా నుంచి క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు. క్రీడల వల్ల మానసిక, శారీరక ఆరోగ్యానికి సానుకూల ఫలితాలను ఇస్తాయని కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులకు జిల్లాలో మంచి స్టేడియం నిర్మాణానికి స్థలం గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. స్టేడియం ఏర్పాటు చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ జిల్లా క్రీడాధికారికి సూచించారు. జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. ఈసారి రాష్ట్ర స్థాయిలో జరగబోయే క్రీడా పోటీల్లో మన జిల్లా తరపున విలు విద్య క్రీడాకారులను పోటీలకు పంపాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు జిల్లా కేంద్ర స్థానం కావాలని కలెక్టర్ చెప్పారు. పాఠశాలలో క్రీడల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో క్రీడాసక్తి నింపాలని ఆయన అన్నారు.

క్రీడా మైదానం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రహదారి మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మూడో రైల్వే లైన్ వేసిన రైల్వే కాంట్రాక్ట్‌ను రప్పించి గుమడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి మార్గంలో గల గోతులను వెంటనే కప్పి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మరమ్మతులకు గురైన రహదారిని సోమవారం పరిశీలించారు. మండల కేంద్రానికి అతి సమీపాన గల గుమడ రైల్వే స్టేషన్ ఉందని, ఈ స్టేషన్‌కు సంబంధించి పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే బిటి రహదారి మార్గం నుంచి గుమడ రైల్వే స్టేషన్ వరకు బిటి రహదారి గతంలో బాగా ఉండేదన్నారు. రాయగడ నుంచి పార్వతీపురం వరకు మూడో రైల్వే లైన్ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించే సందర్భంలో వివిధ ప్రాంతాల నుంచి గుమడ రైల్వే స్టేషన్‌కు మూడు లైన్‌కు సంబంధించిన సామాగ్రి పెద్దపెద్ద వాహనాల ద్వారా గుమడ రైల్వే స్టేషన్‌కు రాత్రీ పగలు తెప్పించే పరిస్థితి ఉందని అన్నారు. ఈ రహదారి మొత్తం పెద్ద పెద్ద గోతులుగా మారడంతో వర్షం పడితే నీరు చేరడంతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారి మార్గంలో ఉన్న గోతులను కప్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే దసరా అనంతరం ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధు, చింతామణి, రామారావు, కైలాస్, వెంకట్రావు, సుబ్బారావు, రమేష్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా ప్రసన్నకుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక తహశీలాదర్ కార్యాలయంలో సోమవారం నూతన తహశీల్దార్‌గా జె. ప్రసన్నకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రాములమ్మ బదిలీపై వేపాడ మండలానికి వెళ్లడంతో ఈయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, హెచ్‌డిటి ఉమామహేశ్వరరావు, విఆర్ఒలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జరిపిన బదిలీల్లో పార్వతీపురం ఎంపిడిఒగా నియమితులైన రూపేష్, సీతానగరం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ప్రసన్నకుమార్ సోమవారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రని, ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడపడానికి అధికారుల సహకారం ఎంతో అవసరమని, ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ విధులను సక్రమంగా నిర్వర్తించి ఆయా మండలాలకు చక్కని పేరు తీసుకురావాలని కోరారు.

గృహ నిర్మాణాలకు జియో ట్యాగింగ్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని దళిత, కస్పా తదితర వీధుల్లో సోమవారం 2014-2019 సంవత్సరాలకు సంబంధించిన ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాలకు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు వీలుగా జియో టాగింగ్ చేస్తున్నట్లు బృందం తెలిపింది. జియో ట్యాగింగ్ అయిన వివరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశాల మేరకు జియో ట్యాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ సహయకులు ఎస్ శశిభూషణరావు, పైడిరాజు, ఎన్ కళ్యాణ్, డి మాణిక్యరావు, డి రాజు తదితరలు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞానంపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

న్యాయవిజ్ఞానంపై మహిళలకు జాతీయ న్యాయ సేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కురుపాం కోర్టులో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె. సౌమ్య జోసఫ్ పాల్గొని మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి ఎలా బయటపడాలి, మహిళలకు ఉండే హక్కులు, చట్టాలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఎ.వి.ఎల్ పద్మజ, పి.వి. వరలక్ష్మి, లీగల్ వాలంటీర్లు అంధవరపు కోటేశ్వరరావు, సామల రాజేష్, మేఘాలయ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం బెలగాం రైల్వే గేట్‌కి సమీపంలో సోమవారం రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విశాఖపట్నం నుంచి రాయపూర్ వెళ్తన్న ప్యాసింజర్ రైలు గరుగుబిల్లి మండలం వద్దగోలు గ్రామానికి చెందిన తూముల బాలకృష్ణ (37)ను ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న జిఆర్‌పి ఎస్ఐ బాలాజీ రావు, కానిస్టేబుల్ విఎన్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీలక్ష్మి అలంకరణలో పోలమాంబ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో గల పోలమాంబ అమ్మవారిని సోమవారం శ్రీలక్ష్మి దేవి అవతారం అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మండప పునః పూజలు, లక్ష్మి సహస్ర నామ హెూమం, చండీ హెూమం, పరివారాలకు ప్రత్యేక పూజలు, అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ, పూజారి శ్రీనివాస శర్మ, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - వీరఘట్టం

వృత్తి విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా బాలిక విద్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఎపిఒ హరిప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) ప్రధాన ఉపాధ్యాయులు బిడ్డిక సుంబోర అనుమతితో పిఎం శ్రీ వృత్తి విద్యా కోర్సులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. వృత్తివిద్య కోర్సుల్లో భాగంగా దసరా సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు 10 రోజుల పాటు ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం ఏర్పాటు చేశామన్నారు. ఆటోమెటిక్ ట్రేడ్ విభాగంలో పదిమంది విద్యార్థులు అపరల్ ట్రేడింగ్ విధానంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వృత్తి విద్యా విద్యార్థులు నైపుణ్యాలు నేర్చుకుని జీవితంలో గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం వృత్తివిద్య ఉపాధ్యాయులు ఆర్.కుమారి, టి.ఈశ్వరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

నూతన మద్యం పాలసీ విధానం 2024-26 దరఖాస్తు టెండర్ గడువు ఈనెల 9 సాయంత్రం వరకు ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు నిర్దేశించిన గడువులోగా నాన్ రిఫండబుల్ డిడి, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలతో స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించాలని ఎక్సైజ్ ఎస్ఐ జె రాజశేఖర్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలానికి చెందిన ఆరు షాపులకు సోమవారం సాయంత్రం నాటికి 42 దరఖాస్తులు వచ్చాయని, ఇంకా ఎవరైనా టెండర్ కావాల్సి ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోపు సమర్పించాలని అన్నారు.

దండోరా, డ్రీమ్ లఘుచిత్రాలకు జ్ఞాపికలు

ప్రజాశక్తి - వీరఘట్టం

బహిరంగ మలవిసర్జన అంశంతో దండోరా కలలకు కారణాలు, మూఢనమ్మకాలు అంశంపై చిత్రీకరించిన డ్రీమ్ లఘు చిత్రాలకు తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ విజయవాడ వారు నిర్వహించిన పోటీలకు చక్రీ చిత్రాలు అర్హత సాధించినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కొండపల్లి గౌరునాయుడు తెలిపారు. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య కేంద్రంలో ఈ నెల 6 నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు అజయ్ గోష్ చేతుల మీదుగా లఘు చిత్రాలకు ఎడిటర్ కొండపల్లి చక్రికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. దండోరా చిత్రానికి వీరఘట్టం మండలం కిమ్మి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు, జెవివి జిల్లా అధ్యక్షుడు కొండపల్లి గౌరునాయుడు దర్శకత్వం వహించి నటించగా, డ్రీమ్ చిత్రానికి కొండపల్లి చక్రి, ఉదయాన ధనుంజయ సంయుక్తంగా దర్శకత్వం వహించినట్లు ఆయన తెలిపారు. కొండపల్లి ఆర్ట్స్ పేరుతో ఇంతవరకు రైతన్న, వనమాలి, న్యూసెన్స్, విత్, దండోరా, డ్రీమ్, మాస్టర్ మొదలైన సందేశాత్మక చిత్రాలు నిర్మించారు. ఇందులో విత్తుచిత్రానికి బి.గౌరీశ్వరరావు దర్శకత్వం వహించగా మిగిలిన చిత్రాలకు కొండపల్లి గౌరునాయుడు దర్శకత్వం వహించినట్లు తెలిపారు. గత ఏడాది తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ నిర్వహించిన లఘు చిత్రాల పోటీలో వీరు చిత్రీకరించిన వనమాలి ఉత్తమ చిత్రంగా నిలిచినట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని జోగిపురం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వాలు, పాలకులు మారినా గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. గిరిజనాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో అభివృద్ధి శూన్యం. దీంతో గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటు జీవనం గడుపుతూ కాలం వెళ్లదీస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

గుమ్మలక్ష్మీపురం మండలం నెల్లికెక్కువ పంచాయతీ పరిధిలో గల జోగిపురం గిరిజన గ్రామం అభివృద్ధికి ఆమడ దూరాన ఉంది. ఇక్కడ 52 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గ్రామం ఏర్పాటై 40 ఏళ్లు దాటినా నేటికీ రహదారి సౌకర్యం, తాగునీరు వంటి మౌలిక వసతులు లేకపోవడంతో గిరి పుత్రులు దయనీయ స్థితిలో జీవిస్తున్నారు. రోడ్డు మార్గం లేకపోవడంతో సకాలంలో వైద్య సేవలు కరువయ్యాయి. విద్య ఇక్కడ అందని ద్రాక్షగా మారింది. పక్కా గృహాలు లేక పోవడంతో శిథిలమైన ఇళ్లల్లోనే క్షణ క్షణం భయం భయంతో జీవనం సాగిస్తున్నారు. పాడుబడ్డ బావి నీటిని నిత్యావసరాలకు వినియోగిస్తున్నారు. తమ గ్రామం కొండ కోనల్లో ఉండడం, అడవి ప్రాంతం కావడంతో ఏ జంతువు వచ్చి

మౌలిక వసతులు లేక గిరిజనుల ఇబ్బందులు

అభివృద్ధికి నోచని జోగిపురం గ్రామం

దాడి చేస్తోందో, విష జంతువులు కాటేస్తాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రోడ్డు లేకపో వడంతో గర్భిణులను, రోగులను డోలీలో వైద్యం కోసం ఆసుప త్రులకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సకాలంలో సరైన వైద్య మందక మృతి చెందిన వారు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తమ సమస్యలను ఎన్నోసార్లు ఎంతమంది అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆ గ్రామాన్ని సందర్శించిన సిపిఎం నాయకులు ముందు ఆవేదన వెళ్లగక్కారు. తాతదండ్రుల నుంచి ఇక్కడ పండే పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రామం విడిచి వేరే ప్రాంతానికి వెళ్లినా బతకలేమని అన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులను వేడుకుంటే కొండ దిగి మైదాన ప్రాంతానికి రావాలంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తున్న నాయకులు మిగతా సమయాల్లో కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. కొండపైన ఉన్న జోగిపురానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో గ్రామస్తులే స్వయంగా రహదారి నిర్మాణం చేపట్టేందుకు ముందుకొచ్చారు. 2017లో రోడ్డు నిర్మాణానికి ఒక్కొక్క ఇంటి నుంచి రూ.30 వేలు చొప్పున రూ. 10లక్షలు చందాలు పోగు చేసుకుని రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. చింతపండు, జీడి పంట అటవీ ఫలసాయాలు అమ్మగా వచ్చిన డబ్బుతో కంబగూడ నుంచి జోగిపురం వరకు సుమారు 6 కిలోమీటర్లు రహదారి నిర్మించినట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనైనా తమ గ్రామాన్ని అభివృద్ధిపర్చి అన్ని మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - కొమరాడ

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మండలంలో మంగళవారం పర్యటించనున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు ఎస్ శేఖర్ పాత్రుడు తెలిపారు. మండలంలోని కోటిపాం కాలనీ నుంచి గుంప సోమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కూనేరులో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఉదయం 11 గంటల సమయంలో కూనేరులో ఎమ్మెల్యే జగదీశ్వరి ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. ప్రజలు, నాయకులు, పాల్గొనాలని కోరారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణంలో ప్రధాన నీటి సరఫరా కేంద్రం నుంచి నీటిని సరఫరా చేసే పైపులైన్ మరమ్మతుకు గురైనందున ఈనెల 8న తాగునీటి సరఫరా వుండదని మున్సిపల్ కమిషనర్ విహెచ్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఒకరోజు సహకరించాలని ఆయన కోరారు.

అడుగుకో గుంత .. ఎన్నాళ్లీ చింత

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాం దూళికేశ్వర ఆలయ సమీపంలో గల ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్లే ప్రధాన రహదారి నుంచి ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో చాలామంది ఈ గుంతల్లో పడి ప్రమాదాలు బారిన పడిన సంఘటన ఎన్నో ఉన్నాయి. నియోజకవర్గ, మండల కేంద్రం కనుక తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో పని నిమిత్తం ప్రజలు రావాలంటే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు గుంతల్లో నీరు నిల్వ ఉండి బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మండల అధికారులకు అక్కడ ఉన్న రోడ్డు సమస్య కనిపించడం లేదానని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. గుంతల్లో

గుంతలమయంగా మారిన రహదారి

వాహనాల దిగి ఇంజన్లు పాడవుతున్నాయి. రోడ్డుపై మోకాలి లోతు గుంతలో పడి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు, వాహనదారులు విమర్శిస్తున్నారు. తాత్కాలికంగానైనా ఆర్‌అండ్‌బి అధికారులు రోడ్లపై మట్టి వేసి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

ప్రజాసేవ కోసం పనిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సాంఘిక సంక్షేమ కార్యకలా పాల్లో విశేషమైన సేవలకు మారుపేరు ఎస్.ఆర్.శంకరన్ అని, ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కొనియాడారు. నిత్యం పేదల సంక్షేమానికి ఆలోచన చేసి ఆయన తెచ్చిన సంస్కరణలు అమోఘమని కలెక్టర్ ప్రశంసిం చారు. పీపుల్స్ ఐఎఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్న శంకరన్ వర్ధంతి కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. తొలుత శంకరన్ చిత్ర పటానికి కలెక్టర్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పూలమాలను వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ త్రిపురలో ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శిగా పనిచేసి, పేదల అభివృద్దే లక్ష్యంగా ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు, జీఒలు అభినందనీయమన్నారు. అటువంటి మహెూ న్నత వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడం మనకు గర్వకారణమని తెలిపారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా 2005లో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన పద్మభూ షణ్‌ను ప్రధానం చేసిన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. నేడు ఆయన వర్ధంతి అని, అటువంటి గొప్పవారిని స్మరించుకొని, వారి అడుగు జాడల్లో

శంకరన్ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్

నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నడవాలని అధికారులకు పిలుపు నిచ్చారు. ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని, జీతం కోసం కాకుండా ఆయన వలే ప్రజా సేవ కోసం ప్రతి ఉద్యోగి పని చేయాలని కలెక్టర్ హితవు పలికారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, జిల్లా అధికారులు తదితరులు భాగస్వామ్యం అయ్యారు.

విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గ్రామ, వార్డు సచివాలయం వాలంటీర్ల సమస్య పరిష్కారం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ ప్రకటించిన పదివేల రూపాయలు వేతనం ఇవ్వాలని తొలగించిన వాలంటీర్లను విధుల్లో చేర్చుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, వాలంటీర్ల సంఘం నాయకుడు దిలీప్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థ తీసుకు వచ్చిందని అప్పటి నుంచి ప్రజలకు అనేక సేవలు, పెన్షన్ ఇంటింటికి ఇవ్వడం భూ సమస్యలు, రేషన్ కార్డు, కాస్ట్ ఇన్కమ్, ఇతర అనేక సేవలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉంటూ సేవలు అందించారన్నారు. వాలంటీర్లు ఏ పార్టీకి చెందిన వారు కాదని అయినా కొంతమంది వాలంటీర్లను స్థానిక నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయించారని చెప్పారు. టిడిపి

మాట్లాడుతున్న నాయకులు, వాలంటీర్లు

కూటమి ప్రభుత్వం అధికారంలో కొస్తే వాలంటీర్లకు రూ.పదివేలు వేతనం ఇస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చారని, ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం పీడీకి వినతి పత్రం ఇచ్చారు. ఆందోళనకి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, శ్రామిక మహిళ సంఘం నాయకులు వి.ఇందిరా సంపూర్ణ మద్దతు తెలిపారు. వాలంటీర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, వాలంటీర్లు అప్పారావు, కరుణాకర్, రమేష్, నాయుడు, మూర్తి పాల్గొన్నారు

వినతులు స్వీకరిస్తున్న నాయకులు

గ్రీవెన్స్‌కు 42 వినతులు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 42 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమం పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సరడాం గ్రామానికి చెందిన రాజారావు డి పట్టా ఇప్పించాలని, చిగురువలసకు చెందిన అమ్మన్న రోడ్డు మంజూరు చేయాలని కోరారు. మర్రిపాడు చెందిన చాందిని స్టాఫ్ నర్స్ పోస్ట్ ఇప్పించాలని, జగత్ పల్లికి చెందిన శారద సీసీ రోడ్డు మంజూరు చేయాలని, జల్లారకు చెందిన విశ్వనాథం పాఠశాల భవనం మంజూరు చేయాలని, మూలగూడకు చెందిన బంగారి కుట్టు మిషన్ ఇప్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ ఇఒ నారాయుడు, పిహెచ్ఒ గణేష్, ఎటిడబ్ల్యూఒ మంగ వేణి, సిడిపిఒ రంగ లక్ష్మి, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్, దయానంద్, ఎఎంఒ కోటి బాబు, పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

ప్రజాశక్తి - సీతంపేట

నీతి ఆయోగ్, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద సంపూర్ణ అభియాన్ ముగింపు వేడుకను స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యాన నిర్వహిం చారు. ఈ ముగింపు వేడుకలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను ఐటిడిఎ పిఒ సత్కరిం చారు. ఇందులో భాగంగా 6 సూచికల్లో వంద శాతం సంతృప్తతను చేరుకోవడానికి తమ శాయశక్తులా కృషి చేసిన బిఎల్ఒలు, ఫ్రంట్‌లైన్ కార్యకర్తలను సత్కరించారు. భామిని మండలంలో ఈ 6 సూచికలు నీతి అయోగ్ అందించిన సమయ పరిమితి కంటే ముందు గానే సంతృప్తమయ్యాయని తెలిపారు. భామిని బ్లాక్ స్థాయి అధికారులు, ఫ్రంట్‌లైన్ కార్మికుల మద్దతుతో సెప్టెంబర్ 25న సూచించిన 6 సూచికలు విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, సోషల్ డెవలప్మెంట్ విభాగాల్లో సంతృప్తి పొందినట్లు పీవో తెలిపారు. భామిని మండల ఎంఇఒ, సిడిపిఒ, ఎంఒ, ఎపిఎం, బత్తిలి, బాలేరు, భామిని వైద్యాధికారులు, ఆశా కార్య కర్తలను సత్కరించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చిన్నబాబు, డిడి అన్నదొర, ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు, సిడిపిఒ శాంతి భవాని, వైద్యా ధికారులు డాక్టర్ పి.సోయాల్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మక్కువ : మండలంలోని కాశీ పట్నం, మార్కండేపుట్టి గ్రామాల్లో ఎన్ఎల్ఎం బృందం సభ్యులు ఉపాధి పనులు, పింఛన్లను సోమవారం పరిశీలించారు. హౌసింగ్ లబ్ధి దారులు, మహిళా సంఘాల వివరాలను విఒల ద్వారా తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ నుంచి వచ్చిన టీం సభ్యులు ఎం.కె శశి అపన్, కేజీ సలీమ్ కుమార్, డి ఎల్‌డిఒ, ఎపిడి రాజేష్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

చినబొండపల్లిలో ఇరు వర్గాల మధ్య కొట్లాట

పార్వతీపురంరూరల్ : మండలంలోని చిన బొండపల్లిలో ఇరు వర్గాల మధ్య సోమవారం చెలరేగిన వాగ్వివాదం కొట్లాటకు దారి తీసింది. ఇరు సామాజిక వర్గాల మధ్య జరిగిన గొడవ ఒకరిపై ఒకరు దాడి చేసుకునే పరిస్థితికి చేరుకుని ఇద్దరు యువకులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు హుటాహుటిని ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.

గ్రామాలాభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు ఉండాలని ఎంపిడిఒ పి. త్రివిక్రమరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు మెంబర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కోసం ప్రణాళిక ఉండాలన్నారు. గ్రామాలలో సిసి రోడ్లు, కాలువలు వంటి సమస్యలను పరిష్కరించే దిశగా సిద్ధమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బి. రవణమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తిరుపతిరావు, మురళీ కృష్ణ, మనోహర్, శశిభూషణరావు, శ్రీనివాసరావు, కామేశ్వరరావు, సంతోష్ కుమార్‌తో పాటు వివిధ గ్రామాల వార్డు నెంబర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం: పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు బాధ్యత వహించాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకొని

సీతానగరం: మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి వెంకటరమణ, ఎఒ డి వెంకటరమణ, ఎపిఒ జి.సత్యం నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచులు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మక్కువ: పంచాయతీలలో అభివృద్ధి సంక్షేమం కోసం జరిగే గ్రామసభలలో ప్రతి ఒక్క సభ్యుడు బాధ్యతగా హాజరు కావాలని ఎంపిడిఒ డిడి స్వరూప రాణి అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముందుగా పంచాయతీ ప్రతినిధులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఇఒపిఆర్‌డి దేవకుమార్ మాట్లాడుతూ సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు కూడా పంచాయతీల అభివృద్ధిలో భాగస్వామ్యం ఉండాలన్నారు. అన్ని పంచాయతీల ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని 53 గ్రామ పంచాయతీలకు చెందిన ఉపసర్పంచులు, ఇద్దరు సభ్యులకు స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపాలన, తాగునీరు, సమావేశాలు, గ్రామ సభ నిర్వహణ మొదలకు అంశాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిపి బి.ఆదినారాయణ, డిఎల్‌పిఒ రాంప్రసాద్ ఈ శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు బి.సుదర్శనరావు, డి.రాజశేఖరం, వై.పాపారావు వివిధ అంశాలపై వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఎఒ మానస తదితరులు పాల్గొన్నారు .

7.70 టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)కు చెందిన 7700 కిలోల బియ్యం అక్రమ రవాణా జరుగుతుండగా పట్టుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారి బి.ప్రసాదరావుకు అందిన సమాచారం మేరకు సోమవారం తమతో పాటు సీతానగరం రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించామన్నారు. బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా కాశీపేట-సీతానగరం మధ్య బొలెరో పికప్ వాహనంలో 52 బస్తాలు 2600కేజీలు, అశోక్‌లైలాండ్‌లో 53బస్తాలు 2650 కేజీలు, మరో బొలెరో వాహనంలో 49 బస్తాలు 2450కేజీలు వెరసి 154 బస్తాలు 7700 కిలోల బియ్యం అక్రమ రవాణాను గుర్తించామన్నారు. ఈ

మూడు వాహనాలు సీజ్

పట్టుబడిన బియ్యంతో అధికారులు

బియ్యం విలువ సుమారు రూ.3,50,350గా అంచనా వేశామన్నారు. ప్రజా పంపిణీకి చెందిన బియ్యాన్ని అక్రమంగా బొబ్బిలి మండలం పిరిడి, కమ్మవలస గ్రామాలకు చెందిన రేపాక శ్రీనివాసరావు, భోగిరాల శ్రీనివాసరావు, కేతల ధనుంజయరావు రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. యజమానులను పిడిఎస్ బియ్యం గుర్తించి ప్రశ్నించగా, చుట్టుపక్కల గ్రామాల్లో పిడిఎస్ బియ్యం కిలో రూ.18లకు కొనుగోలు చేసి వాటిని ఒడిశాలో అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిపారని చెప్పారు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ ఉంచడం, అమ్మడం నేరమని పేర్కొంటూ సదరు వ్యక్తులైన, వాటి వాహన డ్రైవర్లు, యజమానులపై సెక్షన్ -6ఎ, 7(1) కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, శేషగిరి, సిఎస్‌డిటి ఎన్.రమేష్‌బాబు, విఆర్ఒలు ఎస్.లక్ష్మి, జి.నాగమణి, ఎం.సింహాచలం, కుమారస్వామి పాల్గొన్నారు.

మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు
E.P. 1/2020 OS 36/2017

బిట్వీన్ :
సారిక చంద్రశేఖర్ ....డిక్రీ హోల్డరు.
ఎండ్
దాసరి గోవింద నాయుడు డైడ్ వగైరాలు
......జడ్జిమెంట్ డెటార్స్

జేడిఆర్ 4 :- దాసరి జగదీష్, తండ్రి లేటు గోవింద నాయుడు, వయస్సు 23 సం॥లు ఇంటి నెం. 17-42, లూథరన్ హాస్టల్‌కు ఎదురుగా టి.బి. రోడ్డు కొత్తబెలగాం, పార్వతీపురం.

పై డిక్రీ హోల్డరు మీపైన ఇ.పి షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయింపించమని కోరుతూ పై"అమలు" దాఖలు చేసినందున ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్నయెడల **2024వ సంవత్సరం అక్టోబరు నెల 18వ తేదీన ఉదయం గం॥ 10.30 నిముషముల**కు ఖుద్దున గాని వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి శ్రీ కోర్టువారితో మనవి చేసుకోవలసినది. లేని ఎడలా సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మాణం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు
పి. రాజేశ్వరరావు
డిక్రీ హోల్డరు తరపు అడ్వకేటు
పార్వతీపురం.